జిల్లాలో కొత్తగా 9 కోవిడ్ కేసులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కోవిడ్-19 వైరస్ నెమ్మదిగా విస్తరిస్తూ జిల్లాను చుట్టేస్తోంది. శుక్రవారం ఒక్కరోజే ఎనిమిది పాజిటివ్ కేసులు నమోదు కావడంతో పాటుగా శనివారం ఒక్క కేసు నమోదుకాగా, గతనెల 16 నుంచి ఇప్పటివరకు 70 కేసులు నమోదు కాగా రెండు మరణాలు సంభవించాయి. జిల్లావ్యాప్తంగా అనుమానిత లక్షణాలున్న 159మంది నుంచి గురువారం శ్వాబ్ నమూనాలను తీసి 108 ఆర్ పిసిఆర్, 51 మందికి ర్యాపిడ్ పరీక్షలను నిర్వహించగా శుక్రవారం వెల్లడించిన నివేదికలో 9మందికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుత వైరస్ ప్రభావం తక్కువగా ఉండి ప్రాణాపాయం ఉండక పోయినా వేగంగా విస్తరించడంవల్ల ఎక్కువమంది కోవిడ్ బారిన పడే అవకాశాలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

నీడ లేని 'ఉపాధి'

- ఎండల్లో కూలీల పాట్లు
- రెండేళ్లుగా వసతులు కల్పించని సర్కార్

ఎండలోనే ఉపాధి పనులకు హాజరైన కూలీలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండల్లో నీడ లేకుండా ఉపాధి హామీ పథకంలో పాటుపడుతున్న కూలీల పాట్లు పట్టించుకునే వారు కరవయ్యారు. కూలీలకు వసతులులేక పోవడంతో ఎండల తీవ్రత రోజురోజుకి పెరుగుతున్న నేపథ్యంలో మండే ఎండలలో చెరువులు, కాలువల్లో పూడికతీత పనుల్లో పాల్గొంటున్న వారికి నిలువ నీడ లేకపోవడంతో అల్లాడిపోతున్నారు. టెంట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం రెండేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహస్తోందని కూలీలంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో 21 మండలాలు ఉండగా 385 గ్రామ పంచాయతీలున్నాయి. 3.42 లక్షల జాబ్ కార్డులు జారీ చేయగా 5.96 లక్షల మంది కూలీలు నమోదయి ఉన్నారు. వీరిలో 4,59,414 వేతనదారులు రెగ్యులర్ గా పనులకు వెళుతున్నారు. ప్రస్తుతం ఈ వేసవిలో 40 నుంచి 45 డిగ్రీల వరకూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం రోజుకి సరాసరి 66 వేల మంది ఉపాధి పనులకు వెళతున్నారు. ప్రతి ఏడాది అన్ని ప్రాంతాల్లోనూ టెంట్లను పంపిణీ చేసేవారు. అయితే గత రెండేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా టెంట్ జాడ కనిపించడం లేదు. దీంతో కూలీలు ఎండ తీవ్రతను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. పలువురికి వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురవుతున్నారు. కొండల్లో పని ప్రదేశాల్లోనే ప్రాణాలను వదులుతున్న సంఘటనలు కూడా ఉంటున్నాయి.

అసౌకర్యాల నడుమ పనులు

ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నప్పటికీ యంత్రాల ద్వారా వరి కోతలు జరుగుతుండడంతో పలువురు వ్యవసాయ కార్మికులకు పనులు లేకుండా పోయాయి. దీంతో పొట్టకూటి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో మండుటెండల్లో సైతం ఉపాధి పనులకు వెళుతున్నారు. ఎండలు మండిపోతున్నా కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, ఎండ తీవ్రతను తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదంటూ కూలీలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు వరకు ఉపాధి పనులు చేసే ప్రాంతాల్లో కూలీలకు కనీస సౌకర్యాలైన టెంట్లు, షెడ్ల ద్వారా నీడ కల్పించాలి.

ఇప్పటి దాకా జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులు చేసే ప్రాంతాల్లో ఎక్కడా వీటిని ఏర్పాటు చేయలేదు. మరో వైపు ముందస్తుగానే ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉంచాల్సి ఉన్నా ఎక్కడా వాటి జాడ లేదు. వడదెబ్బకు గురైతే తక్షణ ఉపశమనం కోసం పని ప్రదేశాల్లోనే ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ సరఫరా ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా రెండేళ్లుగా పట్టించుకోవడం లేదు. కేవలం పని చేసినందుకు కూలీ సొమ్ములు మాత్రమే ఇచ్చి చేతులు దులుపేసుకుంటున్నారు.

వసతులు కల్పించాలి



కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఉపాధి పనులకు వెళుతున్నాం. మండుటెండల్లో పనిచేయడంతో నీరసించిపోతున్నాం. కొంతసేపైనా సేద తీరేందుకు ప్రభుత్వం టెంట్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా అన్ని వసతులు కల్పించాలి.

గొట్టుముక్కల సూర్యనారాయణ, ఉపాధి కూలీ, పి.మల్లవరం, తాళ్లరేవు మండలం

రెండేళ్లుగా పంపిణీ నిలిచిపోయింది

గత రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి టెంట్లు పంపిణీ కావడంలేదు. గతంలో ఇచ్చిన వాటినే ఉపయోగించుకోమని క్షేత్రస్థాయిలో సిబ్బందికి తెలియజేస్తున్నాం. ఎండల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నాం.

అడపా వెంకటలక్ష్మి, డ్వామా పీడీ, కాకినాడ జిల్లా

తునిలో ప్రచార భేరి నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

బిజెపిని సాగనంపుదాం

తునిలో సిపిఎం ప్రచారభేరి

ప్రజాశక్తి - కోటనందూరు (తుని)

ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం... ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం... అంటూ సిపిఎం కాకినాడ జిల్లా కమిటీ సభ్యురాలు కె.బేబీ రాణి ఆధ్వర్యంలో శనివారం తునిలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలపై పన్నుల భారాలు తగ్గించాలని, పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని తుని గొల్ల అప్పారావు సెంటర్ దగ్గర నుంచి ర్యాలీగా బయలుదేరి నినాదాలు చేస్తూ తుని మున్సిపల్ కార్యాలయం వరకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీ రాణి మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయవలసిన సమయం వచ్చిందని. మోడీ అమిత్‌షాల నాయకత్వంలో బిజెపి ఆర్ఎస్ఎస్ కూటమిలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండవలసిన ప్రజల మధ్య మత విద్వేషం రెచ్చగొడుతున్నారు. మరోవైపు అదాని, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను కారు చవకగా దోచిపెడుతోందని, దీనిపై ప్రశ్నించే ప్రతి ఒక్కరిని నిరంకుశంగా జైలుపాలు చేస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న స్వతంత్రం ప్రమాదంలో పడిందని. జాతీయోద్యమ స్ఫూర్తితో దేశ స్వతంత్ర ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని... ప్రజలందరి ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులను మనం కట్టిన పన్నులతో నిర్మించిన ప్రభుత్వ రంగ పరిశ్రమలనే ఓడరేవుల్ని అభిరికి మన అందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు దారాదత్తం చేసేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో గ్యాస్ బండ గుదిబండగా మారిపోయిందని, కరెంట్ బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నట్లుగా రేట్లు పెంచారని. నిరుద్యోగిత బతుకులు ఆగాధంలోకి జారిపోతున్నాయన్నారు. కార్మికులకు కనీస వేతన అమలు చేయటం లేదని, పేదలకు ప్రాణాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని సైతం మోదీ ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. మహిళలకు రక్షణ లేకపోగా దాడులు పెరిగాయని, దళితులు, గిరిజన ప్రజలు సంక్షేమానికి సామాజిక న్యాయానికి. దూరమైపోతున్నారన్నారు. మోడీ బిజెపిని గద్దె దించాలని. ఈ నెల 26వ తేదిన కాకినాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు నక్కెళ్ళ శ్రీనివాస్, ఎస్.కె. పద్మ, బి.నాగేశ్వరరావు జి.రమణ ఎం.కామేశ్వరి, సత్తి దేవి, గనిరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు

ముమ్మిడివరం ఎంఎంసి చైర్మన్‌గా నేడు కుడుపూడి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కుడుపూడి శివన్నారాయణ

ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన కుడుపూడి శివన్నారాయణ ఈ నెల 23 వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా శివన్నారాయణ ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి, ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌కు, సహకరించిన నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 23 వ తేదీ ఆదివారం మహిపాల్ చెరువు సెంటర్లోని గ్రాండ్ పార్క్ కళ్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు కమిటీ డైరెక్టర్లతో కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతున్నట్టు తెలిపారు. ముందుగా తన నివాసం వద్ద 9 గంటలకు ర్యాలీ ప్రారంభమై పదిన్నర గంటలకు వేదిక వద్దకు చేరుకుంటామన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ఇతర సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివన్నారాయణ విజ్ఞప్తి చేశారు.

24న మాలల మల్లయుద్ధభేరి

ప్రజాశక్తి - కాకినాడ

భారత రాజ్యాంగ రక్షణ, ఎస్‌సి, ఎస్‌టి ఓబీసీ, క్రైస్తవ మెజారిటీ, మహిళల హక్కుల పరిరక్షణకు ఈనెల 24 తేదీన మాలల మల్లయుద్ధ భేరి మహాసభ కాకినాడ మెక్లారిన్ గ్రౌండ్‌లో జ్యోతిరావు పూలే వేదిక వద్ద జరుగుతుందని ఆంధ్ర మాల మహానాడు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు శనవారం తెలిపారు. ఆంధ్ర మాల మహానాడు 7వ వార్షికోత్సవం సందర్భంగా ఛలో కాకినాడ నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో నాయకులు పాల్గొంటారని, అందరూ తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గోడపత్రిక ఆవిష్కరించారు. రత్నం బాబు, లింగం శివప్రసాద్, చెంగళ రావు, గుబ్బల ఆది నారాయణ, లింగం నాని, అంబటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అప్పుల్లో మనం అందరినీ అధిగమించేశాం కద్సార్..!!

మత్తుకు ... పేదల బతుకులు బలి

- పల్లెలు, పట్టణాల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- ప్రాణాలను హరిస్తున్న మహమ్మారి
- వీధిన పడుతున్న కుటుంబాలు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

పిఠాపురం పట్టణానికి చెందిన ధనాల గణేష్ (37) గత కొంత కాలంగా నాటు సారాకు అలవాటు పడ్డాడు. రెండు రోజుల క్రితం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వైద్యుల వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. అదే పనిగా సారా తాగడం వలన పచ్చకామెర్లు వచ్చి చని పోయాడని వారు తెలిపారు. దీంతో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య, ఇద్దరు పిల్లలు గణేష్ మతితో వీధిని పడ్డారు. నెలరోజుల క్రితం అంబేద్కర్ సెంటర్‌కు చెందిన పెయ్యాల సత్తిబాబు (50), 20 రోజుల క్రితం యు.కొత్తపల్లి మండలం జొన్నల గురువు ప్రాంతానికి చెందిన బత్తిన లోవరాజు (41) సారా రక్కసికి బలయ్యారు. ఇలా అనేకమంది సారా మత్తులో చిత్తవుతున్నారు. కూలీ నాలీ చేసుకుంటూ బ్రతుకులు ఈడుస్తున్న అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రాణాలను తోడేస్తున్న సారా అమ్మకాలు ఎక్కడికక్కడ యదేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు.

కాకినాడ జిల్లాలో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా నాటుసార విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ దొరుకుతుంది. చీప్ లిక్కర్ ధరలు గణనీయంగా పెరగడంతో మద్యానికి అలవాటు పడిన సామాన్యులు సారా వైపు మొగ్గు చూపుతున్నారు. మందుబాబుల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ కొందరు సారా తయారీ అమ్మకం దారులు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా తీర ప్రాంత మండలాల్లో తయారీ ఎక్కువగా ఉంది. జిల్లాలో పిఠాపురం,తుని, యు.కొత్తపల్లి, తొండంగి, కోటనందూరు, శంకవరం, ఏలేశ్వరం, తాళ్లరేవు తదితర మండలాల్లో యథేచ్ఛగా సారా తయారీ జరుగుతోంది. ప్రధానంగా తుని నియోజకవర్గ పరిధిలోని హంసవరం, కొత్తూరు, లోవ కొత్తూరు, తాళ్లూరు, తొండంగి మండలంలోని అద్దారిపేట, పంపాదిపేట, వేమవరం, ఒంటిమామిడి, కోటనందూరు మండలంలోని కాకినాడ జిల్లా అనకాపల్లి సరిహద్దు ప్రాంతమైన భీమవరపు కోట, సంఘువాక, అల్లిపూడి, రాజవరం, కొట్టాం తదితర గ్రామాల్లో సారా తయారీ విచ్చలవిడిగా జరుగుతుంది. ఇక్కడ తయారైన సారా వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. ఇటు యు.కొత్తపల్లి మండలంలోని కొన్ని మారుమూల గ్రామాల్లో సైతం అక్కడక్కడ సారా తయారీ జరుగుతుంది. ఇక్కడ నుంచి పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని వివిధ ప్రాంతాలకు చిన్నచిన్న బడ్డీ దుకాణాలకు విక్రయాలకు కోసం సారాను పంపిణీ చేస్తున్నారు. ప్రధానంగా కొండ ప్రాంతాల్లో సైతం సారాబట్టీలు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి. పేదలు, సామాన్యులు ఎక్కువగా దీనిని ఆశ్రయిస్తుండడంతో తయారీదారులు రసాయనాలను వినియోగించి తక్కువ సమయంలో కల్తీ నాటు సారాను తయారుచేసి అమ్మకాలు జరుపుతున్నారు. దాంతో అనేకమంది ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గతంలో లీటరు సారా రూ.200 లోపు ఉంటే డిమాండ్ ఆధారంగా ఇప్పుడు రూ. 500 పైనే అమ్ముతున్నారు.

మద్యాన్ని పూర్తిగా నిషేధించాలి

మద్యాన్ని సేవించడం వల్ల అనారోగ్యాలకు గురై అనేకమంది ప్రాణాలను కోల్పోతున్నారు. ముఖ్యంగా నాటుసారా విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నారు. అధికారులు మాత్రం తూతూ మంత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. సారా నియంత్రణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలి.

ఎన్. సూర్యనారాయణ, మద్యపాన వ్యతిరేక పోరాట సమితి, జిల్లా కన్వీనర్

అధికారులు ఏం చేస్తున్నారంటే...

ఎన్ని దాడులు చేస్తున్నా, కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నా వారి కన్ను గప్పి సారా తయారీ, అమ్మకాలు మళ్లీ మళ్లీ పునరావృతం అవుతున్నాయి. దీనికి కారణం ఎక్సైజ్ అధికారులే సారా అమ్మకందారులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 2,537 కేసుల్లో పట్టుబడిన 52,229 లీటర్ల నాటుసారాను నేమాంలో ఇటీవల పోలీసులు ధ్వంసం చేశారు. 275 కేసులలో 962.39 లీటర్లను తేటగుంట వద్ద ధ్వంసం చేశారు. 13 మందిపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించారు. నల్ల బెల్లం రవాణాపై నిఘా ఉంచామని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ వెలుగులోకి వస్తున్న కేసులు మాత్రమే. ఆపరేషన్ పరివర్తన వంటి కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు చేస్తే సారాను కొంతవరకైనా అదుపులో ఉంచే అవకాశం ఏర్పడుతుంది.

జి.మేడపాడులో కరపత్రం ఆవిష్కరిస్తున్న సిఐటీయూ నాయకులు

మేడే వేడుకలు విజయవంతం చేయండి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

137వ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమాన్ని గ్రామ గ్రామానికి జరిపి విజయవంతం చేయాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు పిలుపునిచ్చారు. శనివారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే ప్రతి గ్రామంలో ప్రతి యూనియన్ విజయ వంతం చేయాలని కోరుతూ మండలం మాధవపట్నం, వేట్లపాలెం గ్రామాల్లో బిల్డింగ్ వర్కర్స్ కమిటీ సమావేశాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్ మేడే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సిఐటియు సభ్యులు మేడే పతకాన్ని ప్రతి ఇంటి వద్ద ఆవిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాధవపట్నం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పాలిక త్రిమూర్తులు, కార్యదర్శి కె. లోవ బాబు, నాయకులు రమేష్, షేక్ ఖాజా, డి. శ్రీను, రాంబాబు, బాపన్ సాహెబ్ పాల్గొన్నారు.

దవులూరి సుబ్బారావుకు ఎంపి బోస్ పరామర్శ

దవులూరి సుబ్బారావును పరామర్శిస్తున్న ఎంపి బోస్, వైసిపి నాయకులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇటీవల పాము కాటుకు గురై మండలంలోని పనసపాడు మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి రాష్ట్ర కార్మిక నాయకుడు, మున్సిపల్ కోప్షన్ సభ్యులు దవులూరి సుబ్బారావును శనివారం సాయంత్రం రాజ్యసభ సభులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పరామర్శించారు. సుబ్బారావు తనయుడు ఎపి స్టేట్ హౌసింగు కార్పోరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జి దవులూరి దొరబాబుతో కలసి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దవులూరి సుబ్బారావును పరామర్శించి, యోగ క్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట వైసీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు మోరంపూడి రంగ, వైస్ ఎంపిపి పేర్నిడి వెంకట రాయుడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మినారాయణ, వైసిపి కౌన్సిలర్‌లు నేతల హరిబాబు, పాగా సురేష్ కుమార్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు వున్నారు.

వికలాంగుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రిలయన్స్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం

వికలాంగులకు రిలయన్స్ సేవలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉమా మనోవికాస కేంద్రం తాళ్ళరేవులో నిర్వహిస్తున్న దివ్యాంగుల పునరావాస కేంద్రం అనేక మంది దివ్యాంగులకు సేవలు అందిస్తుందని వాటిని మరింత విస్తరిస్తామని రిలయన్స్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక సీతారాంపురంలోని కేంద్రంలో గోపాల్ అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రుల వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రిలయన్స్ ఆధ్వర్యంలో ఇప్పటికీ ఈ కేంద్రానికి అనేక సౌకర్యాలు కల్పించామని వాటిని మరింత మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ చిన్నారులకు ఫిజియోథెరపీ కేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉమా మనో వికాస కేంద్రం డైరెక్టర్ ఎస్పి రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం

అవగాహన సదస్సులో సిఐ శ్రీనివాస్

ప్రజాశక్తి- కరప

రోడ్డు ప్రమాదాలు జరగకుండా యువత రోడ్డు నియమ నిబంధనలను పాటించి, హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం సాగించాలని కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసు అన్నారు. ఉప్పలంక గ్రామంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని ఎస్సై నౌడు రామకష్ణ తెలిపారు. వేసవిలో అనేక చోట్ల రాత్రి సమయాలలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామకష్ణ సూచించారు. దూర ప్రాంతాలు వెళ్లేటప్పుడు తమ ఇళ్లకు తాళాలు వేసుకుని సాయంత్రం సమయంలో లైట్లు వెలిగే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా ప్రవేశించి సంచరించినట్లయితే వెంటనే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నయోమి సతీష్, కోరంగి ఎస్ఐఐ పి.శ్రీనివాసు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న రిలయన్స్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం

క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలపై తర్ఫీదు ఇవ్వాలని క్రీడలతో విద్యార్థులు శారీరక మానసిక ఆరోగ్యం వృద్ధి చెంది ఉత్తమ ఫలితాలు సాధించి, జీవితంలో మరింతగా రాణిస్తారని త్రివర్ణ హైస్కూల్ చైర్మన్ తోటకూర వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పెదబ్రహ్మదేవం త్రివర్ణ హైస్కూల్‌లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల సమక్షంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో విజేతలకు చైర్మన్ తోటకూర వెంకటేశ్వరరావు సర్టిఫికేట్లు, బహుమతులు అందజేశారు. అలాగే 2021-2022 10వ తరగతిలో 550 పైగా మార్కులు సాధించిన పూర్వ విద్యార్థులకు పాఠశాల ప్రతిభా అవార్డులు, మెడల్స్‌ను బహుకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు కె. గోపికృష్ణ కె.లలిత కుమారి, అకడమిక్ డైరక్టర్ జి.చక్రవేణి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

వ్యర్థపదార్థాల నిర్వహణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల శనివారం పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆదిత్య కళాశాల- డి మార్ట్ ప్రాంతాల మీదుగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు అక్కడే ఉన్న నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్ కు సూచనలు ఇచ్చారు. అక్కడి నుంచి వెహికల్ యార్డ్ ను సందర్శించారు. పర్యటనలో భాగంగా ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణా కేంద్రాన్ని కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల పరిశీలించారు. ఎన్విరాన్ ఎకో మేనేజ్మెంట్ సంస్థ ద్వారా పొడి చెత్త ను ప్రాసెసింగ్ ప్రక్రియ చేస్తున్నట్లు డిఈ మాధవి వివరించారు. అలాగే తడి చెత్త ద్వారా ఆర్గానిక్ కంపోస్ట్ తయారు చేస్తున్నట్లు కమిషనర్ కు తెలియజేశారు.. వీటి నిర్వహణను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

శృంగార వల్లభ స్వామి ఆదాయం రూ.4.42 లక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతిలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయాన్ని అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. శనివారం ఒక రోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ3,63,580,అన్నదాన విరాళాల ద్వారా రూ 67,980, కేశఖండన ద్వారా రూ 10,750 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేశామన్నారు. యాత్రికులకు ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్,గ్రామస్తులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహన్‌రావు, సత్య నారాయణలు సేవలందించారని తెలిపారు.

ఘనంగా రంజాన్ ప్రార్థనలు

పెద్దాపురంలో రంజాన్ ప్రార్థనలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణంలో శనివారం రంజాన్ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కట్టమూరు పుంత లోని ఈద్గా మెట్టపై కవాడి వీధి జామియా మసీద్ ఇమామ్ జనాబ్ మౌలానా షరీఫుల్ రహీం రిజ్వి సాహెబ్ ఆధ్వర్యంలో ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ చేశారు. **రౌతులపూడి** మదీనా మసీదులో ముస్లింలు రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో షేక్ సలీం. ఎండి సల్మాన్. షేక్ హుస్సేన్. షేక్ మున్న మండలంలో ఉన్న ముస్లిం పాల్గొన్నారు. **పెదపూడి** మండలంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని గొల్లల మామిడాడ, పెద్దాడ, సంపర గ్రామాల్లోని ముస్లింలంతా ఆయా మసీదుల్లో సామూహికంగా ఈదుల్ ఫితర్ నమాజ్ చేశారు. ఈ సందర్భంగా మశీదు ఇమామ్‌లు ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

అగ్నిప్రమాదంలో కాలిపోయిన షాపులు

అగ్నిప్రమాదంలో మూడు షాపుల దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని ద్రాక్షారంలో గల బళ్ల గేట్ మార్కెట్ వద్ద శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు షాపులు దగ్ధమయ్యాయి వీటిలో విప్పర్తి ఏడుకొండలు టైలరింగ్ షాపు ఆకుల కొండబాబుకు చెందిన గ్యాస్ రిపేరింగ్ సెంటర్, వాడపర్తి రామచంద్ర రావు చెందిన లాండ్రీ షాపు అగ్నికి ఆహుతి అయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు మొత్తం నష్టం రెండు లక్షల వరకు ఉంటుందని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. రామచంద్రపురం అగ్నిమాపక సిబ్బంది ద్రాక్షారం పోలీసులు సకాలంలో స్పందించడంతో మంటలు మిగిలిన షాపులకు వ్యాప్తి చేయకుండా అరికట్టగలిగారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

ప్రజాశక్తి-కొత్తపేట

పాము లక్ష్మి(ఫైల్)

వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కొత్తపేట ఎస్ఐ వి.మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వానపల్లి గ్రామ శివారు ఇందిరానగర్ కు చెందిన పాము లక్ష్మి(34) పాన్ షాప్ నిర్వహిస్తోంది. ఈనెల 15 వ తేదీ బయటికి వెళ్లిన ఆమె ఎంతసేపటికి రాకపోగా ఆమె కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో ఆచూకీ కోసం గాలించగా లభ్యం కాలేదు. అడ్డ కాలువ సమీపంలో రైతుకు చెందిన కొబ్బరి తోటలో నీరు పెట్టేందుకు వెళ్లిన కూలి పని చేస్తున్న వ్యక్తికి దుర్వాసన రావడంతో చూడగా అగ్రికల్చర్ పంపు నీటిలో మృతదేహం కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులకు తెలపగా పాము లక్ష్మి(ఆమె కట్టుకున్న చీర బట్టి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే రావులపాలెం సీఐ ఎన్.రజిని కుమార్, కొత్తపేట ఎస్ఐ మణికుమార్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రికి పంచనామా నిమిత్తం తరలించారు. దీనిపై మృతురాలి భర్త పాము కాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కేశనకుర్రు గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న అప్పన్న చెరువు (అమృత సరోవర్)లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు వైసిపి మండల అధ్యక్షులు పిన్నమరాజు వెంకట పతిరాజు సొంత నిధులతో ఉపాధి కూలీలకు మజ్జిగను శనివారం పంపిణీ చేశారు. ఆయన మట్లాడుతూ కూలీలకు దప్పిక తీరాలనే లక్ష్యంతో ప్రతి రోజు సరపరా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఇందు కూరి రంగరాజు, వైసిపి జిల్లా నాయకులు మోకా రవి, మాజీ జెడ్పిటిసి సభ్యులు కాశి పరివాజ్ కుమార్ పాల్గొన్నారు. ఉపాధి కూలీలు వెంకట పతిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. **ఆత్రేయపురం** ఉచ్చిలి కాలువ రేవులో శనివారం కనకదుర్గదేవి గుడి వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దాతలు పులవర్తి నాగరాజు అండ్ సన్స్ సహకారంతో వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే యాత్రికులు, ఇతర బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు పేరూరి నాగేశ్వరరావు, కార్యదర్శి పట్నాల నాగరాజు, కోశాధికారి వెచ్చ నాగ వెంకట సుబ్రహ్మణ్యం, సభ్యులు పులవర్తి మణికంఠ, వెచ్చా నాగ వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

డ్రెయిన్, కల్వర్టు నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని పెద్ద కాలువ వద్ద ఉన్న పూలే విగ్రహం వద్ద నుంచి మహిమ ఆవరణ వరకు నిర్మిస్తున్న సిసి డ్రెయిన్, కల్వర్టు పనులను కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్‌లు శనివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కాలనీ వాసుల సౌకర్యార్థం రూ.6.75 లక్షల మున్సిపల్ జనరల్ నిధులతో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు.

మండుతున్న ఎండలు- అమ్ముడుకాని 'బొండాలు'

- రగులుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు.గత పది రోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి 40 నుంచి 46 వరకూ ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోతతో సామాన్య ప్రజలు విలవిలాడుతున్నారు. మరోవైపు మారుతున్న వాతావరణ పరిస్థితులు కారణంగా అనేకమంది రోగాల బారిన పడుతున్నారు దగ్గు, జలుబు, గొంతు నొప్పితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇంకోవైపు అందరికీ అన్నం పెడుతున్న అన్నదాతలు ప్రభుత్వ విధానాలు కారణంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మంచి ధర వస్తుందని, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఉమ్మడి జిల్లాలో 60 శాతానికి పైగా రైతులు బొండాలు ధాన్యం రకాన్ని పండించారు. అయితే ప్రభుత్వం ఈ ధాన్యం కొనుగోలుపై స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నదాతలు రగిలిపోతున్నారు. ఇప్పటికే మూడు జిల్లాలలోనూ పలు ప్రాంతాల్లో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. మండుతున్న ఎండలు వేళ యంత్రాల ద్వారా పనులు పూర్తి చేస్తున్నారు. అయితే ప్రభుత్వం బొండాలు కొనుగోలు చేయకపోవడంతో మద్దతు ధర కన్నా తక్కువకు ప్రైవేటు వ్యాపారస్తులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఒక్కో బస్తా వద్ద రూ.200 నుంచి 250 నష్టపోతున్నారు. కానీ అధికారులు మాత్రం కొనుగోలుపై దష్టి సారించడం లేదు.

-బొండాలు కొనుగోలుపై దుమారం

బొండాలు రకం ధాన్యం ఆశాజనకంగా పండడంతో పలువురు రైతులు అమ్మకాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.ఈ నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ కాకినాడ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పర్యటించారు. తప్పకుండా ఈ రకం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ ఒక్క గింజ కూడా కొనలేదు.ఆయన పర్యటన జరిగి వారం రోజులు దాటుతున్నా అతీగతీ లేదు. మరోవైపు ఈనెల 19న కాకినాడ జెడ్‌పి కార్యాలయ సమావేశ హాలులో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో బొండాలు కొనుగోలుపై స్పష్టత ఇవ్వాలని పలువురు అధికార, విపక్ష ప్రజాప్రతినిధులు పట్టుబట్టారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు రాకపోవడంతో అధికా రులు ఈ సందర్భంగా నీళ్ల నమిలారు. మంత్రులు చెల్లుబోయిన వేణు గోపాలకష్ణ, దాడిశెట్టి రాజా సమావేశంలో ఉన్నప్పటికీ బొండాలు కొనుగోలుపై నోరు మెదపలేకపోయారు. స్వయంగా ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంఎల్‌సిలు తోట త్రిమూర్తులు, ఐ.వెంకటేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు తదితరులు ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.. రైతుల సమస్యను నిర్లక్ష్యం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

అయినా పాలక పెద్దలు బొండాలు ఎప్పటి నుంచి కొనుగోలు చేస్తారో..ఎంత కొనుగోలు చేస్తారో.. పూర్తిస్థాయిలో స్పష్టత ఇవ్వకపోవడం విశేషం.

- కలవర పెడుతోన్న కరోనా

రెండేళ్ల క్రితం ప్రపంచాన్ని వణికించి లక్షల్లో ప్రాణాలను బలిగొన్న కరోనా మహమ్మారి ఉమ్మడి జిల్లాలో మరోసారి వ్యాప్తి చెందుతుంది. ఈ నెలలో ఇప్పటివరకు కాకినాడ జిజిహెచ్‌లో 65 పైనే కరోనా కేసులు నమోదయ్యాయి. అల్లూరి జిల్లా వై.రామవరానికి చెందిన 21 ఏళ్ల ప్రసాద్ ఈనెల కరోనా లక్షణాలతోనూ, డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెనికేరుకి చెందిన 25 ఏళ్ల యువకుడు సందీప్ కరోనా పాజిటివ్‌తో మరణించారు. దీంతో మరోసారి కరోనా అందర్నీ కలవరపెడుతోంది. రోజురోజుకీ కేసులు తీవ్రత పెరుగుదలతో జిల్లా వాసుల్లో ఆందోళన పెరుగు తోంది.ఈ నేపథ్యంలో అధికారులు నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

7న అల్లూరి శత వర్ధంతి కవితల పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి - కాకినాడ

స్వాతంత్ర్య సమర యోధుడు, తెలుగు జాతి ముద్దు బిడ్డ అల్లూరి సీతా రామరాజు తెల్లవారి తూటాలకు బలైన మే 7వ తేదీన శత వర్ధంతి సంద ర్భంగా అల్లూరి సీతారామరాజు స్మారక కళా వేదిక, కాకినాడ వారి ఆధ్వర్యంలో అల్లూరి శత వర్ధంతి అమృతోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వహణా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఔత్సాహికల నుండి ఈ దిగువ అంశాలపై 20 లైన్లకు మించకుండా, తమ కవితలు పోస్ట్ ద్వారా కానీ, స్వయంగా కానీ ఈ దిగువ చిరునామాకు ఈనెల 30వతేదీ లోగా చేరేట్లు పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కవితల్లో న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన వాటికి ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు మెమెంటో, సర్టిఫికేట్ మే 7న అల్లూరి శత వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖుల సమక్షంలో ప్రధానం చేస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ సర్టిఫికెట్ ప్రధానం చేస్తారన్నారు. 1. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి పోరాట స్ఫూర్తి. 2. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో స్వాతంత్ర్య సమర యోధుల త్యాగ నిరతి.... ఈ అంశాలపై కవితలు రాయాల్సి ఉంటుం దన్నారు. కవితలు పంపవలసిన చిరునామా పి.ఎస్ఎస్ ఎన్.పి.శాస్త్రి, లిటరరీ సెక్రటరీ, అల్లూరి సీతారామ రాజు స్మారక కళా వేదిక, ఏపీ స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అర్బన్ ఎంఆర్ఓ కార్యా లయం, కాకినాడకు పంపాలని సూచించారు.

సంచులను అందజేస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

వృక్షాలే మానవాళికి ఆత్మబంధువులు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

వృక్ష సంపద జీవా వర్ణాన్ని పరిరక్షిస్తూ మానవాళికి జీవనోపాధి కల్పిస్తూ ఆత్మబంధువుగా నిలుస్తుందని గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు అన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి రక్షిత దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూతాపం వల్ల జీవరాశి మనుగడకు ముప్పు ముంచు కొస్తుందన్నారు. దట్టమైన అడవులను నరికి వేయడం, సహజ నిక్షేపాలను అంతూ పొంతూ లేకుండా తవ్వడం వల్ల పర్యావరణ సమతు ల్యత దారుణంగా దెబ్బతింటుందని అన్నారు . విలువైన భూ వనరులను పొదుపుగా వాడుకుని మన భవిష్యత్ తరాలకు అందించడం మనందరి కనీస ధర్మమని అన్నారు. ఇందుకు గాను విరివిగా మొక్కలు నాటి అవి పెరిగే వరకు సంరక్షించాలని సుబ్బారావు తెలిపారు. అనంతరం గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, డాక్టర్ శిరీష ,రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

అమరవల్లి పంచాయతీ పరిధిలో ఉన్న తమ్మయ్య పేట గ్రామానికి తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ పులి జయ బాబు తెలిపారు శనివారం తమ్మయ్య పేటలో మండల ప్రజా పరిషత్ నిధులతో సుమారు రూ.మూడు లక్షలతో పదివేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంకు నిర్మాణానికి సర్పంచ్ శంకుస్థాపన చేశారు మండల ప్రజా పరిషత్ ద్వారా నిధులు అందించిన ఎంపిపి కారే సుధా శ్రీనివాస్‌కు కతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో ఎంపిటిసి గోగు లోవ కుమారి,

తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జయబాబు

జగన్నాథం, ధన బాబు, కాపు రెడ్డి, చొక్కా శివాజీ, తదితరులు ఉన్నారు

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి -కరప

కరప మండలం వేళంగి గ్రామం చెందిన ఇద్దరు యువకులు గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. శనివారం పితాని ఈశ్వరరావు కుమారుడు రాజేంద్ర ప్రసాద్, కొప్పిశెట్టి ఏడుకొండలు కుమారుడు మురళీ సాయి ప్రమాద వశాత్తు కే.గంగవరం మండలం కూళ్ళ వద్ద గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపిపి వెంకటేష్ శ్రీ లక్ష్మీ సత్తిబాబు పార్టీ మండల అధ్యక్షుడు చింత ఈశ్వరరావు ఉన్నారు.

యానాం వార్తలు

ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి- యానం

రంజాన్ మాసం సందర్భంగా యానాం నియోజకవర్గంలో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు దీక్షలు విరమించి రంజాన్‌ను శనివారం వేడుకగా జరుపుకున్నారు. నియోజకవర్గంలోని చారిత్రాత్మక జామియా మసీదు,ఫెర్రీ రోడ్ లో ఉన్న ఎ క్యూబా మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం యువకులు, పెద్దలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. గురువులు వారికి ఖురాన్ సందేశాన్ని అందించారు.ముస్లింలు అందరూ నూతన వస్త్రాలు, శిరస్సుపై కుఫీ లు ధరించి,సుగంధ పరిమళాలు వెదజల్లే అత్తర్లు పూసుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. దేశంలో శాంతి సౌభ్రాత్వాలు వెల్లివిరియాలని సర్వ మానవాళి సుఖ శాంతులతో విలసిల్లాలని కోరుతూ ప్రార్థనలు జరిపారు.అనంతరం వారికి మత గురువులు ఉర్దూలో ప్రసంగించారు.అనంతరం ముస్లింలు అంతా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలకు ఎఐటియుసి మద్దతు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన ఎంపి ఎన్‌జిఒ అమరావతి జెఎసి ఆందోళనకు కాకినాడ జిల్లా ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ శనివరం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే సామూహిక ధర్నాకు ఎఐటియుసి అనుబంధ ప్రజా సంఘాల మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని, సిపిఎస్ రద్దు చేస్తానని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని ఉద్యోగులకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. ఆప్కాస్ విధానం వల్ల ఎన్నడూ లేని విధంగా కార్మికుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పిఎఫ్ ఈఎస్ఐ కోసం అయితే తప్పనిసరిగా విజయవాడ వెళ్లాలని అధికారులు సూచిస్తు న్నారన్నారు. అందుబాటులో ఉండే కార్యాలయంలో పనులు జరగడం లేదని, అందుకే ఆప్కాస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని ప్రసాద్ అన్నారు. ఈ నెల 25 జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక ధర్నా, 29 సచివాలయాలు వద్ద ఆందోళనలకు ఉద్యోగులు తలపెట్టిన ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రసాద్ తెలియజేశారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కురసాల కన్నబాబు, వైసిపి నాయకులు

ఎంఎస్ఎన్ పూర్వ విద్యార్థికి సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ

విద్యలోనే కాకుండా సమాజానికి ఉపయుక్తమైన అంశాలపై దృష్టి పెట్టి నూతన ఆవిష్కరణలు చేస్తున్న ఎంఎస్ఎన్ పూర్వవిద్యార్థి వి.దుర్గాప్రసాద్ ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. పేద మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన దుర్గాప్రసాద్ భవన నిర్మాణ కార్మికులు శ్రమను గుర్తించి వారికి అనువుగా కదిలే నిచ్చెన(మొబైల్ లేడర్) ఆవిష్కరించారు. దీనికి గాను పేటెంట్ హక్కులను పొందారు. విద్యార్థిని ప్రోత్సహించి ఫిజిక్స్ టీచర్ ఎస్..భవాని తోడ్పాటు అందించారు.

ఈ సందర్భంగా పాఠశాలచైర్మన్ ఆదినారాయణ, లక్ష్మీ తులసి, కరస్పాండెంట్ ముతుకుమిల్లి శ్రీ విజయ్ దుర్గాప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలోదుర్గాప్రసాద్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రయివేటు పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆత్మీయ విందు జరిగింది.

దుర్గాప్రసాద్ ను సత్కరిస్తున్న ఎంఎస్ఎన్ యాజమాన్యం

ఘనంగా ఎంఎల్‌సి తోట పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి-మండపేట

పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు పుట్టినరోజును మున్సిపల్ చైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైసిపి యువనేత తోట పృథ్వీ, కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్ ల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోట పుట్టినరోజు సందర్భంగా పట్టణ పరిధిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు మొండి భవాని, కొవ్వాడ బేబి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, వైసిపి నాయకులు మురళి, అప్పన్నబాబు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ఆఫీసర్స్ క్లబ్‌లో కిరణ్ మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్న మెంట్‌ను శనివారం జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేహదారుఢ్యానికి క్రీడలు దోహదపడ తాయని బాల బాలికలు అందరూ క్రీడల్లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ద్వారంపూడి వీరభద్ర రెడ్డి, కాకినాడ డిఎస్‌పి పి. మురళీకృష్ణరెడ్డి, కాకినాడ ఆఫీసర్స్ క్లబ్ కార్యవర్గం, సభ్యులు, పోలీస్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో కాకినాడ డిఎస్‌పి తదితరులు

నిలకడగా బాలుని ఆరోగ్యం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సర్జరీ అయిన బాలుడు

పిచ్చి కు క్క దాడిలో గాయా ల పాలై చికిత్స పొందు తున్న మూడేళ్ల చిన్నారి హేమంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని కాకినాడ జిజిహెచ్ వైద్యులు తెలిపారు. కాజులూరు మండలం తిప్పరాజుపాలెం గ్రామానికి జట్టి దుర్గారావు, పావని మొదటి సంతానమైన హేమంత్ శుక్రవారం ఉదయం ఆడుకోవడానికి కిందకు దిగుతుండగా అక్కడే ఉన్న పిచ్చి కుక్క బాలుడిపై దాడి చేసింది. దీంతోమ తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను తల్లితండ్రులు కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. శనివారం బాలుడికి ప్లాస్టిక్ సర్జరీ నిర్వహించడంతోపాటుగా, ప్రత్యేక వైద్య బృందం బాలుడిని పర్యవేక్షిస్తోంది. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపర్డెంట్ డాక్టర్ హేమలత దేవి మాట్లాడుతూ బాలుడికి ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు.

కత్తిపూడిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-శంఖవరం(అన్నవరం)

శంకవరం మండలం లోని కత్తిపూడి గ్రామలో ఏర్పాటుచేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శంఖవరం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కష్ణవేణి తెలిపారు. శనివారం శంఖవరం మండలం కత్తిపూడి లో ఉన్న వివేకా యువ నిర్మాణం సభ్యుల ఆధ్వర్యంలో కంప్యూటర్ ,ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే శిక్షణను ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు నెల రోజులు పాటు నిర్వహించే ఈ శిక్షణను 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు పలు సూచనలు సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో వివేక యువనిర్మాణ్ సభ్యులు లక్కీరామ్ ప్రసాద్ వెంకటేశ్వరరావు సురేష్ సీతారామ కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణ వేణి

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ పాలన

రాజ్యసభ సభ్యులు సుభాష్ చంద్రబోస్

మా నమ్మకం నువ్వే జగనన్న...

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ పాలన చేస్తున్నారని రాజ్యసభ సభ్యులు,రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. పెద్దాపురం మండలం జి రాగంపేట గ్రామంలో శనివారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేసిన ఎన్నికల హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథాకలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి గవరసాన సూరిబాబు,ఎంపీటీసీ కాలే అనురాధ,ఏ ఎం సి వైస్ చైర్మన్ బండారు వీరబాబు,వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యులు ఏలేటి అనంతలక్ష్మి,మాజీ జడ్పిటిసి బంగారు కృష్ణ,వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న బోస్, దవులూరి దొరబాబు

పాతకోట వద్ద యువత రక్షణ చర్యలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి నుంచి యానాం వెళ్లే ఏటిగట్టు రోడ్డు పాతకోట వద్ద రాజవేరి సమీపంలో అత్యంత ప్రమాదకరంగా ఉంటోంది. ఇది గోదావరి చెంత ఉండటంతో పాటు పూర్తిగా ఎస్ ఆకారంలో ఉంటుంది. ఇక్కడ పెద్ద కాలువ టేకి డ్రైన్ష్ట గోదావరిలో కలుస్తుంది. రాత్రి సమయంలో ఈ మలుపు కనిపించదు. దీంతో నేరుగా వాహనాలు వచ్చి కింద గోదావరిలోకి సుమారు 20 అడుగుల లోతులో పడి పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. రెండు మూడు సంఘటనల్లో కార్లు ఇందులో పడి కొందరు మరణించగా, పలువురు యువకులు మోటారు సైకిల్‌తో ఇందులో పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఇటీవల మరీ అధికమయ్యాయి. దీనిపై రహదారి భవనాల శాఖ హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకుంది. దీనికి శాశ్వత పరిష్కారం లేకపోవడంతో ప్రమాదాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి. ఈ విషయమై పాత కోట యువకులు ఆలోచన చేసి ప్రమాదాలు నివారణకు తమవంతు కషి చేయాలని నిర్ణయించారు. ఇక ప్రభుత్వాధికారులపై ఆధార పడకుండా వారే చందాలు వేసుకుని, ఈ ప్రమాదకర రోడ్డు పొడవునా ఇనుప స్తంభాలు వేసి వాటికి ఇనుప మెస్‌లు వేయించారు. గ్రామానికి చెందిన ఫీల్డ్ లేబర్ సొసైటీ అధ్యక్షులు అయితాబత్తుల సుబ్రహ్మణ్యం, ముంగి రమేష్, రాజేష్, డాక్టర్ రమేష్, సత్తిరాజు సహా 30 మంది యువకులు రూ.70 వేలు చందాలు వేసుకుని శ్రమదానం చేసి ఇనుప కంచె వేయించారు.

యువకులు దారి పొడవునా ఏర్పాటుచేసిన ఇనుపమెస్

చంద్రబాబుపై దాడికి ఖండన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రతిపక్ష నేత చంద్రబాబుపై మీద దాడి చేయించడాన్ని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్ ఖండించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడూ రాష్ట్రంలో దుర్మార్గపు పరిపాలన కొనసాగుతోందని అన్నారు. తక్షణమే మంత్రిని డిస్మిస్ చేయాలని ధర్మాపాళ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 369/2022 in O.S.No. 379/2022

Between:

Sri Yasarapu Apparao and others

...Petitioners /Plaintiffs

AND

Sri Yasarapu Veera Peddi Raju and Others

...Respondents /Defendants

5th Respondent /Defendant:

Sri Gullapalli Ashwini, D/o. Ganesh, Hindu, Female, 30 Years, Properties, D.No. 67/9/25, Subbarao Nagar, Quoripeta, Rajaahandravaram, Cell: 85208 67858

పై నెంబరు పిటీషనులో /దావాలో పిటీషనర్లు /వాదులు అయిన మేము పిటీషను /దావా దాఖలు చేసిన దర్మిలా 5వ రెస్పాండెంటు /5వ ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు నోటీసులు /సమనులు పంపించి యున్నప్పటికీ మీరు తీసుకొనని కారణముగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా 5వ రెస్పాండెంటు /5వ ప్రతివాది అయిన మీకు నోటీసులు /సమనులు అమలు నిమిత్తం వాయిదా వేసియున్నారు. వాయిదా తేదీ **ది.01-05-2023వ సం॥రం తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను.** లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును అని ఈ ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.

వాయిదా తేదీ: 01-05-2023

ముద్దన శ్రీనివాసరావు, న్యాయవాది, తాడేపల్లిగూడెం. సెల్: 99483 37320